# వేట

## రామినేని ఘణి

**సూర్యుడి** శవం పడమటి కొండల్లో కాలిపోతూంది. మేఘాల కొసలు ఎ(రగా వెలుగుతున్నాయి. గుడిసెలన్నీ సంతాపం (పకటిస్తున్నట్లు తలలు వంచుకొని ఉన్నాయి. సుక్కి ఏడుస్తూంది. దాని ఎదురుగా గుడ్డల్లో చుట్టిన పసిబిడ్డ శవం. సుక్కి ఏడుస్తూంది.

"ఎలుగల్లె ఎల్లిపోనావా, కమ్లా, . .మా అయ్య కాడి కెల్లిపోనావా?. . . వోర్నాదేవుడోయ్! .నేనేం సేతున్(నో. . ." కుళ్ళి కుళ్ళి ఏడుస్తూంది.

కిటికీలో నుంచి, ఆరిపోతున్న చితిమంటల్లో నుంచి వచ్చే చివరి వెలుగులా సూర్యకిరణాలు నేల మీద పరుచుకున్నాయి. ఆ రోజు ఉదయం సూర్య కిరణాలు భూమిని ముద్దాడినప్పుడే, ఆకలితో పోరాడి, పోరాడి కమ్లా చివరి శ్వాస వదిలేసింది. నాలుగు రోజాల (క్రితం అయ్యమీద బెంగతో, ఏడ్చి ఏడ్చి జ్వరం తెచ్చుకుని మంచం ఎక్కింది. ఆ ఆకలి పోరాటంలో శక్తి లేక ఉదయాన్నే చనిపోయింది.

కమ్లాకి నాలుగేళ్ళు.

దాని కళ్ళు దీపాల్లా వెలుగుతుంటాయి.

హాయిగా, చలాకీగా ఆకాశంలోని పక్షిలా ఎప్పుడూ గలగల నవ్వుతూ, జలపాతంలా దూకుడుగా ఉండేది.

సక్కి కళ్ళలో దీపంలాగ వెలుగుతున్న కమ్లా రూపం!

"కమ్లా. . .ఎల్లిపోనావా! ఈ అమ్మ నొగ్గేసి దేవుడికాడ కెల్లిపోనావా!"

కమ్లా శవం పూడ్చడానికి సుక్కి దగ్గర డబ్బు లేదు.

శవాన్ని తీసుకుని వెళ్ళింది సుక్కి. కాటికాపరి 'డబ్బు' అన్నాడు.

పుట్టిన తర్వాత రాసే మొదటి ఆవుదం దగ్గర్నుంచిసచ్చిపోయిన తర్వాత కాల్చే ఆఖరికట్టెవరకు డబ్బుతో అవసరం అనే విషయం సుక్కికి అర్థ మైంది. కన్నీళ్ళతో, వేదనతో పసిబిడ్డ శవాన్ని గుండె కదుముకొని గుడిసె కొచ్చింది. బిడ్డను మట్టి చేయలేని అసహాయత్వం సుక్కి గుండెల్లో నుంచి తన్నుకు వస్తూంది.

"మట్టి సెయ్యటం సేతగాని అమ్మకాడ్నుంచి ఎల్లిపోనావా, కమ్లా"

కన్నీళ్ళు చెంపల మీద నుండి దిగజారి శవం మీద పడుతున్నాయి. చివరి క్షణాల్లో చీకటి సూర్యుడి వెలుగును మింగేసి లోకాన్ని ఆక్రమించు కుంటూంది.

సుక్కికి మావ కోటిగాడు గుర్తుకొచ్చాడు.

కోటిగాడు రిక్షా తొక్కేవాడు.

వాడి రిక్షాను బస్సు గుద్దేసింది. రక్తం మడుగులో చితాచితలైన కోటిగాడి శవాన్ని చూసి— "మావా" అంటూ కళ్ళు తిరిగి పడిపోయింది సుక్కి.

కళ్ళు తెరిచిన సుక్కి అనాథ పక్షి, దానికి ఈ భూ(పపంచంలో కమ్లా తప్ప ఎవ్వరూ లేరు.

సుక్కి కళ్ళు తుడుచుకుంది.

గతం గుర్తొస్తే దాని గుండె అంతులేని వేదనతో నిండిపోతుంది.

"మావా. . .కమ్లా సచ్చిపోనాది, మావా. . .నీ కూతుర్ని బతికించలేకపోయాను, మావా. . .నన్ను సెమించు."

సుక్కికి తనను అన్యాయం చేసి వెళ్ళిన కోటిగాడి మీద కోపం రాలేదు. తన మీద పగబట్టి మావను, కమ్లాని తన దగ్గరకు తీసుకున్న దేవుడంటే అంతులేని కోపం వచ్చింది.

"నన్ను. . .నా మావకు కాకుండా సేశావ్. . . ఇయ్యాల నా కూతుర్ని నీకాడికి తీసుకెళ్ళిపోయావ్. నా నేం పాపం సేశాను, దేవుడోయ్"

గూట్లో మూలగా ఉన్న వెంకటేశ్వరస్వామికి ఆ మాటలు వినిపించాయో లేదో కాని, వీధిలో వెళ్తున్న 'దేవుడయ్య' కు వినిపించాయి. పాడుతున్న లల్లాయి పదం ఆపి అర్జంటుగా సుక్కి గుడిసెలో దూరాడు.

"ఏటే, సుక్కి. . .ఏటే. . .నన్ను పిలిసావ్?"

కొత్త కంఠం విని తలెత్తి చూసింది సుక్కి. దాని కళ్ళ నిండుగా నీళ్ళు ఉన్నాయి.

"కమ్లా. . .కమ్లా. . .సచ్చిపోయిందయ్యా. . . మట్టి సెయ్యటానికెళ్తే..."

దుఃఖం తన్నుకొచ్చి, మాటలు కంఠంలో ఆగిపోయి, బిడ్డ శవం మీద చేయి వేసింది.

దేవుడికి అర్థమయింది.

"ఎళ్తే. . .కాటికావరోడు డబ్బు కావాలన్నాడు. నీకాడ లేవు. ఇలా గొచ్చేసినావ్. . .అంతేనా."

అంతే అన్నట్లు తల వూపింది సుక్కి.

దేవుడు సుక్కివంక నవ్వుతూ చూశాడు.

29—6—83

"ఒసే. . .సుక్కి. . .బిడ్డ పుడితే రాసే మొట్టమొదటి ఆవుదం నుంచి చస్తే కాల్చే సివరి కట్టె వరకు మడిసికి డబ్బుతోనే అవుసరం. ఈ భూమి రూపాయి బిల్ల సుట్టూ సెగసెకా తిరిగిపోతుందే, ఎ(రిమొకవా. . ."

సుక్కి వాడివంక చూసింది.

వాడి అతి చనువు దాని ఆత్మాభిమానం మీద దెబ్బ కొట్టింది.

సుక్కి కళ్ళలోని చురచుర వాడికి అర్థమైంది.

"ఏటే. . .ఏటే. . . అట్టా దయ్యంలా సూత్తావ్. . .నీ కూతురి శవం కుళ్ళిపోద్దే. . . కుళ్ళిపోతే ఈ గుడిసెంతా కంపు కొడుతుందే..."

సుక్కి అయోమయంగా చూసింది.

ఆ ఒక్క క్షణం చాలు దేవుడికి తన పబ్బం గడుపు కోవడానికి. దేవుడు శవాన్ని చూశాడు. సుక్కిని చూశాడు.

రెండు చేతులతో ఎత్తి భుజాన వేసుకున్నాడు.

సుక్కి మరబొమ్మలా చూస్తూంది.

"దేవుడయ్యా. . .కమ్లా. . ." దాని మాట పూర్తి కాలేదు.

"ఏటల్లా సూత్తున్నావ్. . .మడిసికి మడిసి తోడు కాకపోతే మానవుతుందా? ఈమా(తం పాయం నాను నీకు సెయ్యకపోతే ఎట్టా!"

దేవుడు బయటికి నడిచాడు.

ని(స్తాణగా, నీరసంగా లేచి వాడి వెనకనే బయటికొచ్చింది సుక్కి. చీకటి చిక్కగా పరుచు కుంది.

● ● ● ●

ఆకాశంలో చుక్కలు వెలుతురు ముక్కల్లా ఉన్నాయి. తవ్విన గుంటలోకి కమ్లా శవాన్ని పడుకో బెట్టాడు దేవుడు. కమ్లా అమాయకమైన ముఖం "అమ్మా" అని పిలుస్తున్నట్లు అనిపించింది.

"అమ్మా, ఏడవకమ్మా...సచ్చిపోతే ఏడుస్తారా, అమ్మా. . .సిన్ని సిన్ని పిల్లలేడుత్తారు కాని. . . అమ్మ లేడుత్తారా?. . .ఏడవమాక..."

చిన్ని చేతులతో 'కమ్లా' తన కన్నీళ్ళు తుడు స్తూంది.

కమ్లాచేతుల స్పర్శ చెంపలమీద తాకుతున్నట్లు అన్పించింది. అప్పటివరకు గుండెలో అణిచిపెట్టిన బాధ తన్నుకొచ్చింది.

"కమ్లా. . .కమ్లా. . .నా కమ్లా. . . పిడికెడు బువ్వెట్టలేనని సొరగాని కెళ్ళిపోనావా? కమ్లా?"

వణుకుతున్న చేతులతో పిడికెడు మట్టి తీసుకుని శవం మీద పెట్టింది.

"ఇదేనమ్మా నీ తల్లి గుండె. . .ఇదిక్కడే వదిలిపెట్టి వెళ్ళిపోతున్నాను" అన్నట్లుగా కమ్లా గుండె మీద మట్టిని పెట్టింది. దేవుడు మట్టి గుమ్మరించాడు. బతికున్న శరీరం మీద మట్టి గుమ్మరిస్తున్నంతగా సుక్కి బాధ పడింది. ఆ దృశ్యాన్ని చూడలేనట్టుగా సుక్కి కళ్ళు మూసు కుంది. కంటి కొసల్నుంచి కన్నీరు జారింది.

"నాను సూడలేను. . .నాను సూడలేనయ్యా."

సుక్కి లేచి, దుఃఖం తన్నుకురాగా గబగబ శ్మశానంలో నుంచి బయటికి పరిగెత్తింది.

"సుక్కీ. . .ఆగు నేనొత్తున్నాను." దేవుడు అరిచాడు.

గుండెలో బాధ, కడుపులో కన్నపేగు ఆరాటం, పొంగివస్తున్న ఆవేదనను తట్టుకోలేక గుడిసెకు పరిగెత్తుకొచ్చింది.

చాపమీద పడిపోయి ఏడ్చింది.

ఆ ఇంట్లో కమ్లి తిరుగుతున్నట్లే అనిపించింది.

"అమ్మా. . .లేమ్మా. . . ఏడవమాక" అని తనను బుజ్జగిస్తున్నట్లే ఉంది.

చీకట్లో సుక్కి వెక్కి వెక్కి ఏడుస్తూంది.

అడవిలో తప్పిపోయిన దూడకోసం 'అంబా. . . అంబా' అని అరుస్తున్నట్లుగా ఉంది ఆ ఏడ్పు.

సుక్కికి గతం గుర్తుకి రాసాగింది.

తన మావ తనను ఎంతో ప్రేమగా చూసుకొనేవాడు. అల్లరిగా తిరిగే కమ్లి గంతులతో ఆ గుడిసెలో ఆనందం వెలకొన్నట్లే ఉండేది.

మావ కౌగిలిలో కరిగిపోతూ. . ."నాను అదురుష్టవంతురాల్ని" అనుకుంది సుక్కి.

కమ్లి పుట్టినప్పుడు కోటిగాడు సుక్కి పొత్తిళ్ళలో ఉన్న కమ్లిని చూసి, "సూడే. . .నా కూతురు...బంగారంలా మెరిసిపోతూంది" అన్నాడు.

"అన్నీ. . .నీ పోలికలే."

కళ్ళు తెరవని పసికూన ఆబగా తల్లి రొమ్ము కోసం చిన్ని చిన్ని చేతులు చాస్తుంటే, సుక్కి మాతృత్వంతో పులకించిపోయింది.

"ఎలుతురు పువ్వల్లే ఉంది, మావా."

కమ్లి పెరుగుతూంది.

సాయంకాలం కోటిగాడు రిక్షా తొక్కి అలిసిపోయి ఇంటికి రాగానే తప్పటడుగులు వేసే కమ్లిని చేతులు సాచి ఎత్తుకొనేవాడు. కమ్లి ముఖంలో అయ్యను చూసిన సంతోషం ప్రతిఫలించేది. చిన్న చిన్న మాటలు మాట్లాడటం వచ్చింది.

"అయ్యా..."

"కమ్లీ..."

సుక్కి పనిచేసే ఇంట్లో పనికిరాని గౌనులు కమ్లి శరీరంమీదకు వచ్చేవి.

అందమైన కమ్లి ఆ గౌనులో ధనవంతుల బిడ్డలా మెరిసిపోయేది.

"అమ్మో...వూరోళ్ళ దిష్టి నా తల్లిమీనే"


సుక్కి దిష్టి తీసి వేసేది.

తలుపు రెక్క కిర్రుమంది.

ఆలోచనల్లో ఉన్న సుక్కి తల తిప్పి చూసింది. దేవుడు...వాడు తూలుతున్నాడు.

"నానే. . .నాను దేవుడ్నే. . .నీకేం బయం లేదులే, సుక్కీ!"






నోట్లో ఉన్న బీడీని తుపుక్కున వూశాడు. సుక్కి చాప దగ్గరకు తూలుతూ వచ్చాడు. సుక్కి భయంతో వెనక్కి జరిగింది.

జేబులోంచి అగ్గిపెట్టె తీసి వెలిగించాడు. అగ్గిపుల్ల వెలుగులో ముడుచుకున్న సుక్కి వాడి కళ్ళకు మనోహరంగా కనిపించింది.

"దీవం ఎట్టవే..." అగ్గిపుల్ల ఆరిపోయింది.

"దేవుడయ్యా..." భయంతో అన్నది సుక్కి.

"ఆఁ. దేవుడయ్యనే. . . ఈ పేటకే నాను దేవుడిని . . . నువ్వు . . . నువ్వు కోటిగాడి కొబ్బరి నౌజువి. . .కాని ఇయ్యాల నా సేతికి కోడి పెట్టవు..."

వాడు ఎందుకొచ్చాడో సుక్కికి అర్థమైంది.

గుడిసె సన్నని కంతలో నుంచి గుడ్డి వెన్నెల పడుతూంది. చీకట్లో వెతుక్కుంటూ వచ్చి సుక్కి మీద పడ్డాడు. సుక్కి భయంతో గజగజ లాడింది.

"నీకిది నాయం కాదయ్యా. ..నన్నొగ్గెయ్. . ." రెండు చేతులతో దండం పెట్టి ప్రాధేయపడింది.

"ఒల్లకే. . .నాయం. . .దరమం. . . ఆయ్యన్నీ ఉత్తిమాటలు. ఎవడెహే. . .ఈ వోల్ మొత్తం భూపెపంచకంలో సాయం సేసేవాడు! నాను సేసేనే. . .కుళ్లిపోయే నీ కూతుర్ని మట్టి సేసింది నానే. . .నా నడిగితే నీ పాణాలు తీసియ్యాల ఆఁ. . ."

వాడు ముందుకు వస్తున్నాడు. సుక్కి భయంతో వెనక్కి అడుగులేస్తూంది. గోడ తగిలి, కాలు అడ్డం పడి మీద పడ్డది. దేవుడు సుక్కి చేతుల్ని బలంగా పట్టుకున్నాడు.

"నాయాల్దానా. . .ఇయ్యాల నాకు పండగ..."

"నీ జిమ్మడ..." బలం కూడదీసుకొని చేతులను వెనక్కు లాక్కుంది.

ఆ వూపుకి తూగుతున్న దేవుడు నేల క్కొట్టు కున్నాడు. వాడి తల దిమ్మ దిగిపోయింది. లేచి అగ్గిపుల్ల వెలిగించాడు.

సుక్కి ఒక మూల భయంతో ముడుచుకొని ఉంది. చీర భుజంమీద నుంచి జారిపోయింది. గుండె ఎగిసెగిసి పడుతూంది. దేవుడి కళ్ళలో కోర్కె ఎర్రగా, మరింత ఎర్రగా మారింది. హఠాత్తుగా సుక్కి ఒక మూలకు పరిగెత్తింది. దేవుడు చటుక్కున అడ్డం పడ్డాడు. దాని నడుం గట్టిగా పట్టుకున్నాడు.

"నాయల్దానా. . .నీ మిండగా డిస్తాడనుకున్నావా డబ్బులు."

కాలు సాచి డొక్కల్లో బలంగా తన్నాడు. ఎనుబోతు కుమ్మినట్లు సుక్కి కడుపులో పేగులు కిరకిరలాడాయి. దాని కళ్ళలో నుంచి కన్నీళ్ళు గిర్రున తిరిగి చెంపలపై జారాయి.

"మట్టి సేసినందుకు జనమంతా సాకిరీ శాత్తాను. . .నీకు దండవెడతా. . .నీ సెల్లెల్లాంటి దాన్ని..."

దేవుడు సుక్కి చీరను బలంగా పరపర చించేశాడు.

"నీ కాళ్ళట్టుకుంటా."

దేవుడు దానినడుం బలంగా తనవైపు లాక్కుంటూ అన్నాడు:

"సెల్లెలు. . .తల్లి. . .ఎవరూ నాకు తెలియదే... నాకు తెలిసింది ఆడదనే మాంసంపోగు."

సుక్కి పట్టుదల సడలిపోతూంది. ఒంట్లో నిస్సత్తువ. నరాల్లో బలహీనత, చైతన్యం నశించి పోతున్న దాని శరీరం వాడి చేతుల్లో ఒరిగిపోతూంది.

దేవుడు నవ్వాడు. . .విజయగర్వంగా నవ్వాడు. వాడి నవ్వు తెరలు తెరలుగా సుక్కికి వినిపిస్తూంది.

"నువ్వేటే? నీ తల్లైనా, నీ కూతురైనా లొంగి పోద్దే నాకు. . .ఆడ నీ కూతు ర్నమ్మేశాను. . . ఈడ నీ శరీరం లాగేసుకున్నాను." స్పృహ కోల్పోతున్న సుక్కిలో ఆ మాటతో కదలిక వచ్చింది.

"నా కూతుర్ని. . .నా కూతుర్ని అమ్మేసినావా?"

"ఆఁ. . . అమ్మేసెయ్యడం. . . తాగెయ్యటం అంతా అయిపోనాదే."

ఆ మాటలతో సుక్కికి పూర్తి చైతన్యం వచ్చింది. వాడి భుజాలు పట్టుకొని వూపుతూ అడిగింది:

"ఎవరి కమ్మేసావ్. . .చెప్పు. . .చెప్పు..."

"డేరా హాలు దగ్గర ఆసిరమ్మగాడి కమ్మేసాను" అన్నాడు.

నమ్మలేనట్లుగా చూసింది దేవుడివైపు. దేవుడు దాన్ని బలంగా తనకేసి హత్తుకుంటున్నాడు.

గుండెలో నుంచి ఒక స్వరం—

"అమ్మా" అని మారుమ్రోగింది.

"వస్తున్నాను, కమ్మీ."

సుక్కి కళ్ళ ముందు ఆసిరమ్మగాడు, బజార్లో కటిక నేం మీద పడుకోపెట్టిన కమ్మీ రూపం కనిపిస్తూంది.

ఒక్కసారిగా ఆమెలో ఉన్న మాతృత్వం మేల్కొంది.

అంతరాంతరాలలో ఉన్న ఆడతనం విజృంభించింది.

"అమ్మా. . . .అమ్మా. . ."

సుక్కి చెవుల్లో కమ్మీ కంఠం.

"అమ్మా, నన్ను అమ్మేత్తుంటే చూత్తూ వూరుకున్నావా, అమ్మా. . .అయ్య లేడని దేవుడి కిచ్చేసినావా, అమ్మా" అని నిలేసి ప్రశ్నిస్తున్నట్టు అనిపించింది.

"వస్తున్నానే, కమ్మీ."

చేతుల్ని బలంగా విదిలించుకుంటూ పెనుగు లాడింది. దేవుడు తన నడుం గట్టిగా తన వైపుకు లాక్కుంటున్నాడు. కళ్ళముందు కమ్మీ రూపం. వెయ్యి ఏనుగుల బలంతో దేవుడిని తోసింది. దేవుడు ఆ బలానికి వెళ్ళి గోడకు తగిలి 'దబ్'మని క్రింద పడ్డాడు. వాడి తల నుంచి రక్తం జివ్వున

చిమ్మింది.

"అంబా. . ."

రివ్వున బయటకు పరిగెత్తింది. ఆకాశం సుక్కిని వేలవేల కళ్ళతో చూస్తూంది. గాలి రివ్వున వీస్తూంది. సుక్కి పరుగెత్తుతూంది.

కాళ్ళ క్రింద రాళ్ళు, గాజు పెంకులు, ముళ్ళు. కాలువలో నీళ్ళు చింది సుక్కి ముఖాన్ని అంటుకున్నాయి. పరిగెత్తుతూంది డేరా హాలు వైపు...

అప్పుడే డేరా హాలు సినిమా వదిలారు. అసిరమ్మగాడు, వాడి అసిస్టెంట్ నూకాలు పెద్దగా అరుస్తూ అడుక్కుంటున్నారు. వాళ్ళముందు కమ్లా శవం... గుడ్డలో శవం.

"పసిబిడ్డ శవం, బాబూ. దిక్కులేని పచ్చి, బాబూ...అనాద శవం, బాబూ దరమం సెయ్యండి... దరమం, బాబూ."

శవం ముఖం మీద గుడ్డ తీశాడు. స్ట్రీట్ లైటు వెలుగులో జీవం లేని ఆ ముఖంలో వాడిపోని అమాయకత్వం చూసి జాలితో డబ్బులు విసిరేస్తున్నారు. ఆ పసిపాప ముఖాన్ని ఇంట్లో వాళ్ళ ముద్దు పాపల ముఖాలతో పోల్చుకుంటూ 'అయ్యో, పాపం పసిబిడ్డ' అని జాలితో డబ్బులు విసిరేస్తున్నారు.

"అనాద శవానికి దరమం సేత్తే పున్నెం ఒత్తుంది, బాబూ...పసిపిల్ల శవం, బాబూ...అనాద శవం, బాబూ."

వాడి మాటలకు దారంట వెళ్ళేవాళ్ళు, సినిమాకొచ్చిన జనం జాలి, సానుభూతితో డబ్బులు వేస్తున్నారు.

"నాలుగేళ్ళకు సచ్చిపోయిన దిక్కులేని పిల్ల..."

జాలి, దయ, ఆర్ద్రతల్ని వాడు సొమ్ము చేసుకుంటున్నాడు. సినిమాహాలు జనం పలచబడింది. నూకాలు డబ్బు ఏరుతున్నాడు. సుక్కి పరుగెత్తుకుంటూ వచ్చి అక్కడే ఆగిపోయింది. పరుగెత్తుకుంటూ వెళ్ళి అసిరమ్మగాడిముందున్న కమ్లా శవాన్ని చేతుల్లోకి తీసుకుంది.

"రేయ్ పిచ్చిదిలాగుందిరా." నూకాలు అరిచాడు.

"బాబూ...నా కూతురు, బాబూ. . .నా కమ్లా. దేవు డమ్మేసాడయ్యా."

నూకాలు సుక్కి చేతుల్లో నుంచి బిడ్డను లాక్కోబోయాడు. భయంతో శవాన్ని గుండె కదుముకుంది.

"లంజికాన. . .నీ బిడ్డా . . . ఎవడి బిడ్డో" గట్టిగా లాగేయబోయాడు.

వీధిలో ఉన్నవాళ్ళు వింతగా చూస్తున్నారు.

"పిచ్చిది, బాబూ. . .పాపం, ఎప్పుడో దాని కూతురు సచ్చిపోయింది. ఆ బాధతో పిచ్చిదయింది, బాబూ."

"నాను పిచ్చిదాన్ని కాదయ్యా. తల్లినయ్యా తల్లిని."

అసిరమ్మగాడు సుక్కి జుట్టు పట్టుకొని బలంగా లాగాడు. బిడ్డను పట్టుకుని బలంగా తల విదిల్చింది. అసిరమ్మగాడి చేతిలోకి వెంట్రుకలు వచ్చాయి.

బిడ్డను గుండె కదుముకుంటూ రివ్వున పరిగెత్తింది. అర్ధనగ్నంగా, రక్తం కోడుతున్న కాళ్ళతో చూపరులకు భయం గొ పేలా ఉంది సుక్కి.

"రేయ్, నూకాలూ. . .ఇయ్యాల దీని అంతం సూడాల్రా. . .ఆగవే. . .ఆగు."

అడవిలో వేటగాళ్ళ బారి నుంచి పరిగెత్తే లేడిలా పరిగెత్తింది.

వెనక నుంచి అడుగుల చప్పుడు.

కాళ్ళు వణుకుతున్నాయి.

అసిరమ్మగాడు, నూకాలు శక్తికొద్దీ సుక్కిని అందుకోవాలని పరిగెత్తుతున్నారు.

బిడ్డను దక్కించుకోవాలనే తపన.

కన్న పేగు బంధం, మమత అన్నీ ఒక్కసారిగా కదలాడి, వీళ్ళకు చిక్కకూడదు, చిక్కకూడదు అనే దృఢ నిశ్చయంతో బిడ్డను గుండె కదుముకొని పరిగెత్తుతూంది సుక్కి.

"పట్టుకోండి. . .పట్టుకోండి."

దగ్గర కొచ్చేస్తున్నారు. సుక్కి శరీరం భయంతో వణికింది. పరుగెత్తుతూంది.

కాళ్ళకు రాళ్ళు బలంగా గుచ్చుకుంటున్నాయి.

ఎగరొప్పుతో అలిసిపోయింది. శరీరంలోని అణువణువులోని శక్తిని కూడదీసుకుని పరిగెత్తుతూంది.

గుండెలో నరాలు శక్తి లేనట్లు మూలిగాయి!

కడుపులో పేగుల్లో కిరకిరమని చుట్టేసే బాధ!

ముఖంలో నుంచి ఆవిరులు లేస్తున్నాయి!

భయం! బాధ! పట్టుదల సుక్కిని పరుగెత్తిస్తూంది.

కళ్ళు గిర్రున తిరిగాయి!

ఆకాశం, నక్షత్రాలు!

ఒళ్ళు తూలింది. అడుగుభారంగా, దారికి అడ్డంగా రాయి. సుక్కి కాలు బండ రాయిని తాకింది.

అంతే!

మొదలు నరికిన చెట్టులా కూలింది. తల బలంగా బండరాయిని తాకింది. ఆకాశం, నక్షత్రాలు అన్నీ మెదడులో మెరిశాయి.

"ఫట్" మని శబ్దం.

అసిరమ్మగాడు, నూకాలు ఆగారు. సుక్కి తల మీద ఎర్రగా కారిన రక్తపు చార కనిపిస్తూంది. దగ్గరకు వెళ్ళి చూశారు. నూకాలు మెల్లగా అన్నాడు:

"రేయ్ సచ్చిందిరా."

మరణంలో కూడా అపజయాన్ని ఒప్పుకోని వీరమాతలా కమ్లాని గట్టిగా గుండె కదుముకొని ఉంది సుక్కి.

● ● ● ●

"అయ్యా అనాథ శవాలు, బాబూ దిక్కులేని, తల్లీబిడ్డల శవాలు, బాబూ...దరమం సెయ్యండి' నూకాలు, అసిరమ్మగాడు అడుక్కుంటున్నారు.

దేవుడు శవాల బిజినెస్సులో పడ్డాడు. *

